# FORUM FOR GOOD GOVERNANCE

REGISTRATION NO. 653/2009

President :
**M. Padmanabha Reddy** I.F.S.(R)

Vice President :
**S. Gopal Reddy** I.P.S.(R)

Secretary :
**Soma Srinivas Reddy** B.E
Founder: M/s. SSREC

Joint Secretary :
**P. Bhaskar Reddy**
Managing Partner
PBR Select / Social Activist

Treasurer :
**N. Sridevi**
Advocate

Executive Committee :

**P.K. Jha** I.F.S.(R)

**T. Vivek**
Former Member, TGPSC

**Capt. M. Suresh Reddy** B.E
(Retd. IAF)

**V. Arvind Reddy**
All India Sarva Seva Sangh
President

**M. Venkata Rao** C.T.O.(R)

**C. Vishnuvardhan Reddy**
Organic Farmer / Builder

**M. Nikhil Reddy** M.B.A.(F)
Industrialist

హైదరాబాదు

L. No. FGG/CM/REP/ 142 /2024 5-11-2024

గౌ// ముఖ్యమంత్రి గారు
తెలంగాణ రాష్ట్రం
హైదరాబాదు

అయ్యా !

పోలీసుశాఖలో సంస్కరణలు కావాలని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎన్నో కమిటీలు సిఫారసు చేయగా చివరకు 2006 సంవత్సరంలో సుప్రీమ్‌కోర్టు వారు తీర్పు వెలువరిస్తూ ఆరు మార్గదర్శకాలు సూచించినారు. అందులో ముఖ్యంగా రాష్ట్ర భద్రతా కమీషన్ ఏర్పాటు అలాగే పోలీసు కంప్లయింట్ అథారిటీ ఏర్పాటు .

భద్రతా కమీషన్ పోలీసుశాఖ పనితీరును నిశితంగా సమీక్షించడమే కాక వారికి సరియైన సూచనలు, సలహాలు ఇస్తూ పోలీసుశాఖ వారు చట్ట ప్రకారము పనిచేసే విధంగా సహకరిస్తుంది. ఇక పోలీసు కంప్లయింట్ అథారిటీ, రాష్ట్ర మరియు జిల్లాలో పనిచేస్తుంది. రాష్ట్ర కంప్లయింట్ అథారిటీ విశ్రాంత హైకోర్టు జడ్జి ఆద్వర్యంలో ఐ.పి.ఎస్. అధికారులపై వచ్చిన ఆరోపణలను విచారిస్తుంది. అలాగే జిల్లా అథారిటీ విశ్రాంత జిల్లా జడ్జి ఆద్వర్యంలో డి.ఎస్.పి. మరియు క్రిందిస్థాయి అధికారులపై వచ్చే ఫిర్యాదులను విచారిస్తుంది.

గత కొద్ది సంవత్సరాలుగా పోలీసుశాఖను రాజకీయనాయకులు తమ గుప్పిట్లో పెట్టుకొని అన్ని అక్రమాలు చేయించినారు. ముఖ్యంగా అనధికార ఫోన్ ట్యాపింగ్ ప్రతిపక్షనాయకులపై కేసులు వంటివి.

Contd.......2

H. No. 6-1-69, Flat No.204, G.K.R. Mansion, Lakdikapool, Saifabad, Hyderabad – 500004, TS, India
Phone: 040-23230334, E-mail: ffggapindia@gmail.com, Website: www.fggindia.org

అలాగే చాలా సందర్భాలలో భూకబ్జాలు, నేరచరిత్రులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడడం జరిగింది. సుప్రీమ్ కోర్టు ఆదేశాలకు అనుగుణంగా పోలీసుశాఖలో సంస్కరణలు కావాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ హైకోర్టులో పిల్ కూడ వేయడం జరిగింది. కేసు కోర్టులో ఉంది. పోలీసుశాఖలో సంస్కరణలలో భాగంగా ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఈ క్రింది సలహాలు, సూచనలు చేస్తుంది.

1. **తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీసు చట్టం :** దేశంలోని చాలా రాష్ట్రాలలో కొత్త పోలీసు చట్టం లేదా ఉన్నవాటికే సవరణలు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో కొత్త పోలీసు చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

2. **రాష్ట్ర భద్రతా కమీషన్ ఏర్పాటు మరియు విధివిధానాల ఖరారు :** 2021లో హైకోర్టులో కేసు ఉన్నందున ఆదరా బాదరగా ఒక భద్రతా కమీషన్ ఏర్పాటు చేస్తున్నట్లుగా ఒక జి.ఓ. ఇచ్చినా అది ఇంతవరకు అమలుకాలేదు. ఇప్పుడైనా గట్టి రాష్ట్ర భద్రతా కమీషన్ ఏర్పాటు చేయాలి.

3. **పోలీసు కంప్లయింట్ అథారిటీ నియామకం అలాగే విధివిధానాల ఖరారు :** రాష్ట్ర మరియు జిల్లాల వారీగా పోలీసు కంప్లయింట్ అథారిటీని నియమించవలసి ఉండగా హైకోర్టులోని కేసు దృష్ట్యా 2021లో హైదరబాదు మరియు వరంగల్ జిల్లాలో మాత్రమే ఏర్పాటు చేయుటకు జి.ఓ. ఇచ్చినా అది అమలు కాలేదు. ఇప్పుడైనా సుప్రీమ్‌కోర్టు వారు ఆదేశించిన విధంగా రాష్ట్ర మరియు ప్రతి జిల్లాకు ఒక పోలీసు కంప్లయింట్ అథారిటీని ఏర్పాటు చేసి, విధి విధానాలు ఖరారు చేయాలి.

ప్రస్తుతం రాష్ట్రంలోపరిస్థితులలో పోలీసు వ్యవస్థ సరియైన దిశలో పని చేయడం లేదు. రాజకీయ ఒత్తిడుల మధ్య పోలీసు శాఖ తమ విధులు సక్రమంగా నిర్వహించుట లేదు. అలాగే పోలీసు వారి మీద వచ్చే ఫిర్యాదులు విచారించడానికి ఒక స్వతంత్ర వ్యవస్థ లేదు. ఇందుకు గాను రాష్ట్ర భద్రతా కమీషన్ అలాగే పోలీసు కంప్లయింట్ అథారిటీల నియామకం, విధివిధానలు ఖరారు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ రాష్ట్ర ముఖ్యమంత్రి గారిని కోరుతుంది.

భవదీయుడు

యం. పద్మనాభరెడ్డి
అధ్యక్షులు
ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

వార్త

06 Nov 2024 - Page 6

# పోలీసు శాఖలో సంస్కరణలు తేవాలి

## సిఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు శాఖలో సంస్కరణలు తేవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరింది. పోలీ సు శాఖను బలోపేతం చేసేందుకు, అవినీతిని నిర్మూలించి, పోలీసుల్లో జవాబుదారితనం పెంపొందించేలా చేసేందుకు సంస్కరణలు అవసరమని సంస్థ కార్యదర్శి వద్మనాభ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం నాడు సిఎంకు రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. పోలీసు శాఖలో సంస్కరణలు తేవాలన్నది సుప్రీం కోర్టు చాలాకాలం చెప్పిందని, ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో, జిల్లాల స్థాయిలో భద్రతా కమిషన్, పోలీసు కంప్లయింట్ అథారిటీ ఏర్పాటు చేయడం ముఖ్యమైనద ని ఆయన తెలిపారు. భద్రతా కమిషన్ పోలీసు శాఖ పరితీరును సమీక్షించడంతో పాటు తగిన సూచనలు, సలహాలు, పోలీసులు చట్టపరంగా విధులు నిర్వహించే విధ ంగా తనవంతు పాత్రను పోషిస్తుంద ని ఆయన తెలిపారు.

భద్రతా కమిషన్‌ను హైకోర్టు విశ్రాంత జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పోలీసు శాఖలో ఐపిఎస్ అధికారులు మొదలుకుని అన్ని స్థాయిల అధికారులపై వచ్చే అవినీతి ఆరోపణలపై విచారిస్తుందని, ఇదే విధంగా జిల్లా స్థాయిలో వుండే కమిషన్‌కు జిల్లాల విశ్రాంత జడ్జిలు నాయకత్వం వహిస్తారని పద్మనాభ రెడ్డి తెలిపారు. దీంతో పాటు పోలీసు కంప్లయింట్ అథారిటీని ఏర్పాటు వెంటనే చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లాల స్థాయిలో వీటిని ఏర్పాటు చేయాలని దీనివల్ల పోలీసులపై వచ్చే అన్ని రకాల ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకునే అవకాశం వుంటుందని ఆయన తెలిపారు. గతంలో హైదరాబాద్, వరంగల్‌లో పోలీసు కంప్లయింట్ అథారిటీని ఏర్పాటు చేసినా అవి వాస్తవంలో కార్యరూపం దాల్చలేదని ఆయన తెలిపారు. 2021లో హైకోర్టులో వున్న కేసు నేపథ్యంలో అప్పటి సర్కారు ఆదరబాదరగా భద్రతా కమిషన్‌ను ఏర్పాటు చేసినా అది ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదని ఆయ న వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోలీసు శాఖ మరింత పారదర్శకంగా పనిచేసేందుకు భద్రతా కమిషన్‌ను, పోలీసు కంప్లయింట్ అథారిటీని వెంటనే ఏర్పాటు చే యడంతో పాటు వీటికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేయాలని వద్మనాభ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డిని కోరారు.

ఈనాడు
epaper.eenadu.net

# పోలీసుశాఖలో సంస్కరణలపై సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

ఈనాడు, హైదరాబాద్: రాజకీయ నాయకులు పోలీసు వ్యవస్థను గుప్పిట పెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ఈ క్రమంలో పోలీసులపై విచారణ చేసేందుకు రాష్ట్ర భద్రతా కమిషన్, పోలీసు కంప్లయింట్ అథారిటీలను నియమించాలని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి మంగళవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. పోలీసుశాఖలో సంస్కరణల కోసం రాష్ట్రానికి కొత్త పోలీసు చట్టం తీసుకురావాలని కోరారు. గతంలో కమిషన్ ఏర్పాటుకు ఒక జీవో ఇచ్చినా అమలుకాలేదని, ఇప్పుడైనా రాష్ట్ర భద్రతా కమిషన్‌ను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. రాష్ట్ర, జిల్లాల వారీగా పోలీసు కంప్లయింట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని కోరారు.

Date : 06/11/2024 EditionName : TELANGANA
PageNo :

# రాష్ట్రంలో భద్రతా కమిషన్ ఏర్పాటు చేయండి

## సీఎంకు ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో భద్రతా కమిషన్, పోలీస్ కంప్లయింట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని సీఎంను ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ప్రెసిడెంట్ పద్మనాభరెడ్డి కోరారు. పోలీసు శాఖలో సంస్కరణలు తీసుకురావాలని ఇప్పటి వరకు ఎన్నో కమిటీలు సిఫారసులు చేశాయని చివరకు 2006లో సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇస్తూ పలు గైడ్ లైన్స్ ఇచ్చిందని ఆయన అన్నారు. మంగళవారం ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డికి పద్మనాభరెడ్డి లేఖ రాశారు. పోలీస్ శాఖ పనితీరును భద్రతా కమిషన్ పర్యవేక్షిస్తుందని వారికి సలహాలు, సూచనలు ఇస్తుందని తెలిపారు. కంప్లయింట్ అథారిటీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో ఐపీఎస్ లపై వచ్చిన ఆరోపణలను విచారిస్తుందని ఆయన లేఖలో పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థను అధికారంలో ఉన్న నేతలు తమ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటున్నారని ఇందుకు ఫోన్ ట్యాపింగ్, ప్రతిపక్ష నేతలపై కేసులు ప్రత్యక్ష ఉదాహరణలని పద్మానాభరెడ్డి చెప్పారు. నేరస్తులు, భూకబ్జాదారులతో పోలీసులు కుమ్మక్కై బాధితులకు న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలతో 2001లో హైదరాబాద్, వరంగల్ జిల్లాల్లో పోలీస్ కంప్లయింట్ అథారిటీలు ఏర్పాటు చేసినప్పటికీ అవి పని చేయలేదని పద్మనాభరెడ్డి గుర్తు చేశారు.

V6 వెలుగు
Wed, 06 November 2024
https://epaper.v6velugu.com/c/76176024